ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 18 ఫిబ్రవరి 2025



ముద్దలాపురం వద్ద పొలాల్లోనే ఆరబోసిన మిరప కాయలు





రైతును ముంచిన బ్యాడిగ..!

కూడేరు మండలం ముద్దలాపురం గ్రామంలో పదేళ్ల క్రితం బోరుబావుల కింద రైతులు రకరకాల పంటలు సాగుచేసేవారు. గ్రామానికి చెందిన ఇద్దరుముగ్గురు రైతులు బ్యాడిగ మిరప సాగుచేసి వరుసగా లాభాలు గడించారు. మూడేళ్ల క్రితం మిరప క్వింటాలు రూ.50వేల వరకూ అమ్ముడుపోయింది. దీంతో చాలా మంది రైతులు ఇటువైపు మొగ్గుచూపారు. మండలం అంతా రెండు వేల ఎకరాల్లో సాగవుతుండగా.. ముద్దలాపురంలోనే 1500 ఎకరాల్లో బ్యాడిగ మిరప వేశారు. గత నవంబరులో వచ్చిన తుఫాన్లు.. దాని వల్ల తెగుళ్లు సోకి పంట దెబ్బతిని రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

- దెబ్బతీసిన తుఫాన్లు
- భారీగా పడిపోయిన ధరలు
- పెట్టుబడులు రాని వైనం
- అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతలు

కూడేరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బ్యాడిగ మిరప పంట రైతులకు శాపంగా మారింది. లక్షల్లో అప్పులు చేసి పంట సాగు చేస్తే.. తుఫాన్ల కారణంగా మచ్చ తెగుళ్లు సోకడంతో పూర్తిగా దెబ్బతినింది. దీంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కూడేరు మండలంలో రెండు వేల ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగు చేస్తే.. ఒక్క ముద్దలాపురం గ్రామంలోనే 1500 ఎకరాల వరకు సాగు చేశారు. ఎకరం పంట సాగుకు దాదాపు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఖర్చు చేశారు. తీరా పంటచూస్తే ఎకరాకు ఎడెనిమిది క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. ప్రస్తుతం బ్యాడిగ మిరప మార్కెట్‌లో రూ. 5వేల నుంచి రూ. 15వేలలోపు ధర పలుకుతోంది. దీంతో లక్షల్లో అప్పులు మిగిలినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం క్వింటా మిరప రూ. 50వేల వరకు అమ్ముడుపోయాయి. దీంతో మిగిలిన రైతులు కూడా పంట సాగు చేస్తే రెండు సంవత్సరాలుగా రూ.15వేలకు మించలేదు. పండిన అరకొర పంటను తొలగించి పొలాల్లో నిల్వ చేశామని, నాణ్యత లేకపోవడంతో వ్యాపారులు కన్నెత్తి చూడటం లేదని చెబుతున్నారు. నవంబరు నెలలో కురిసిన వర్షాలకు పంటకు మచ్చరావడంతోపాటు నల్లి పురుగు నాశనం చేసిందని, ఎక్కువ కాయలు చెడిపోవడంతో వ్యాపారులు తక్కువ ధరలకు అడుగుతున్నారని రైతులు వాపోయారు. ఒక్కొక్క రైతు 3 నుంచి 30 ఎకరాల వరకు సాగు చేసి నష్టాలపాలయ్యారు.



దెబ్బతిన్న మిరపకాయలు

లక్షన్నర అప్పు మిగిలింది



మూడు ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగు చేశాను. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దాదాపు ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. అరకొరగా పండిన పంటను అమ్మినా లక్షన్నర అప్పులు మిగిలాయి. ఇలాగైతే మళ్లీ పంటలు సాగుచేయలేం. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎర్రిస్వామి, రైతు, ముద్దలాపురం

పొలంలోనే కాయలు



ఐదు ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగుచేశాను. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. కాయలన్నీ అమ్మినా పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. వర్షాలకు దెబ్బతిన్న కాయలను వేరు చేయడానికి కూలీల ఖర్చులు మరింత భారమయ్యాయి. తొలగించిన కాయలు పొలంలోనే ఉన్నాయి.

- గోపాల్, రైతు, ముద్దలాపురం



ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరస్వామి, పార్వతీదేవి ఉత్సవ మూర్తులు

కన్నుల పండువగా భోగేశ్వరుడి కల్యాణం

పామిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శివమాలధారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పసన్న పార్వతీ సహిత భోగేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. ఈ కల్యాణోత్సవానికి గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, గుంతకల్లు ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి హాజరయ్యారు.



మంత్రికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

మంత్రిగారూ.. బ్రహ్మోత్సవాలకు రండి

శ్రీశైలం మహాశివరాత్రి ఉత్సవాలకు మంత్రి కేశవ్‌కు ఆహ్వానం

ఉరవకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలంలో నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆలయ ఈవో, అర్చకులు ఆహ్వానం అందించారు. అమరావతిలోని మంత్రి చాంబర్‌లో సోమవారం ఆయన్ను కలిసి భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వారి చిత్ర పటాన్ని, ప్రసాదాలను అందజేశారు. బ్రహోత్సవాల్లో పాల్గొంటానని మంత్రి వారికి తెలిపినట్లు ఆయన కార్యాలయ వర్గాలు ప్రకటించాయి.



సెంట్రల్ వర్సిటీ అకడమిక్ బ్లాక్ వద్ద బైఠాయించిన విద్యార్థులు

భద్రత కావాలి..!

- సెంట్రల్ వర్సిటీలో కొనసాగిన ఆందోళన
- ఆగంతకులు వస్తున్నా పట్టించుకోలేదని మండిపాటు
- వీసీ కోరి, భద్రతా సిబ్బంది తీరుపై ఆగ్రహం
- వర్సిటీని సందర్శించిన ఎంపీ అంబికా, ఎమ్మెల్యే శ్రావణి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం జంతులూరు సమీపంలోని సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినులు రెండో రోజూ ఆందోళనకు దిగారు. వర్సిటీకి ప్రహరీ లేకపోవడంతో తమకు భద్రత కరువైందని, అగంతకులు ప్రవేశించి బాత్ రూమ్‌లలోకి తొంగిచూస్తున్నారని విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అగంతకులు వచ్చినట్లు వీసీ కోరికి ఆదివారం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నిర్లక్ష్యంగా వెళ్లిపోయారని మండిపడ్డారు. వర్సిటీ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు సోమవారం ఉదయం అకడమిక్ బ్లాక్ వద్ద బైఠాయించారు. వర్సిటీ ప్రహరీని అరకొరగా నిర్మించి వదిలేయడంతో ఎవరు వస్తున్నారో తెలియడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. గత ఏడాది డిసెంబరు 9న వాష్‌రూమ్‌ల్లోకి తొంగిచూశారని, అప్పట్లో వారం రోజులు ఆందోళన చేసినా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ నెల 16న అలాంటి ఘటనే పునరావృతం అయిందని అన్నారు. అకడమిక్ బ్లాక్‌లో ఉన్న వీసీ కోరికి ఆదివారం సాయంత్రం ఫిర్యాదు చేశామని, సమస్య ఏమిటో తెలుసుకోకుండానే ఆయన వెళ్లిపోయారని మండిపడ్డారు. హాస్టల్, సెక్యూరిటీ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినా అడ్డంగా వాదిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరితే టార్గెట్ చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ తల్లిదండ్రులు వర్సిటీకి వస్తే లోపలికి అనుమతించరని, బాత్‌రూమ్‌లలోకి తొంగిచూసేవారి గురించి మాత్రం పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ సెక్యూరిటీ అధికారుల తీరు ఏమాత్రం బాగలేదని మండిపడ్డారు. హాస్టల్‌లో 24 గంటల విద్యుత్, రాత్రివేళ పవర్ బల్బులు ఏర్పాటు చేసి భద్రత పెంచాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

వీసీని బదిలీ చేయాలి: ఎంపీ అంబికా

సెంట్రల్ వర్సిటీనీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలసుకున్నారు. ఆరు నెలల క్రితమే వీసీ, ఇతర అధికారులతో సమావేశాన్ని నిర్వహించి, సమస్యలపై తక్షణమే స్పందించాలని హెచ్చరించామని ఎంపీ అంబికా అన్నారు. వీసీ విద్యార్థులతో చులకనగా మాట్లాడుతున్నారని, మెస్ సరిగాలేదని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీనిపై గవర్నర్‌కు లేఖ రాశామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించామని అన్నారు. గవర్నర్ స్పందించి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినా ఇక్కడ మార్పు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీ కాంట్రాక్టు సిబ్బంది.. బాత్‌రూమ్‌లో ఒక విద్యార్థిని వీడియో తీశారని తెలిసిందని, బయటకు రానివ్వకుండా నొక్కిపెట్టారని ఎంపీ అన్నారు. భద్రాతా విభాగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని, వీసీని తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని అన్నారు.

మొత్తం స్థానికేతరులే: ఎమ్మెల్యే శ్రావణి

వర్సిటీలో మొత్తం స్థానికేతరులే ఉంటున్నారు. ఇక్కడి భాష తెలిసినవారికి అవకాశాలు కల్పిస్తే సమస్య వచ్చేదికాదు. మెస్, వార్డెన్లు, సూపర్‌వైజర్లు, వార్డెన్లు.. ఇలా అన్ని విభాగాల్లో ఉద్యోగాలను స్థానికేతరులకు కట్టబెట్టారు. కాంట్రాక్టర్లు, అధికారులు ఏకమై విద్యార్థులను సమస్యల్లోకి నెడుతున్నారు. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల పర్యవేక్షణను అధికారులు గాలికి వదిలేశారు. వర్సిటీ ప్రతిష్ఠను భంగపరుస్తున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటాము.

భద్రతా చర్యలు చేపడతాం..

వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులతో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ వేర్వేరుగా సమావేశమయ్యారు. వర్సిటీలో భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. సౌఖర్యాలలేమి, సెక్యూరిటీ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని అన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, బ్యాకప్ పవర్‌ను సమకూరుస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, సీఐ కరుణాకర్, ఎస్ఐ శేషగిరి, తాసీల్దార్ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ప్రభుత్వ విప్ కాలవ

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

రాయదుర్గం/రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి కల్యాణమండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ శివనారాయణశర్మతో కలిసి హాజరైన కలెక్టర్ 360 మంది నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆయా శాఖల పరిధిలో బీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం 70 శాతం మేరకు ఉందని దీనిని మరింత పెంచాలన్నారు. ఇక నుంచి జిల్లా అధికారులు వారి పరిధిలోని అర్జీని వ్యక్తిగతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారంలో వచ్చిన దరఖాస్తులలో ఒక దానిని పరిష్కరించాక అర్జీదారుడి స్పందన ఎలా ఉందనే విషయాన్ని జిల్లా అధికారుల గ్రూపులో పోస్ట్ చేయాలన్నారు. ఈ నెల రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రానున్న రోజుల్లో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా వచ్చే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.

- రాయదుర్గంలో జిల్లా స్థాయి గ్రీవెన్స్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలపై కలెక్టర్‌తో చర్చించారు. ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం, ఆవులదట్ల బ్రాంచ్ కాలువ, హెచ్చెల్సీ ఆధునీకరణ, జీడిపల్లి నుండి బీటీపీకి కృష్ణాజలాల తరలింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు.

రేషన్‌కార్డు మంజూరు చేయండి



నేను పట్టణంలోని కేబీప్యాలెస్ ఏరియాలో ఉంటున్నా. రేషన్‌కార్డు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నా. పింఛన్ నిలిపివేయడంతో కుటుంబానికి భారంగా మారా. నా భర్త రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. రేషన్‌కార్డు మంజూరు చేస్తే పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంటా.

- హసీనా, దివ్యాంగురాలు, రాయదుర్గం

మా భూమికి హద్దులు చూపించాలి



కుటుంబంలో నలుగురు అన్నదమ్ములుండగా ముగ్గురు అన్నదమ్ములు 4.60 ఎకరాల భూమిని పంచుకున్నారు. అయితే నాకు రావాల్సిన భూమిని మిగులు భూమిగా చూపించారు. ఎన్నిసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కరించలేదు. మా భూమికి హద్దులు చూపించాలి.

- నరసింహులు, కేపీకుంట వాసి

పింఛన్ తొలగించారు



రూ. 70లు ఉన్నప్పటి నుంచి రూ.మూడు వేల అయ్యేదాక పింఛన్ తీసుకున్నా. రెండేళ్ల కిందట ఫింఛన్ తొలగించారు. కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు పింఛన్‌ను అందించాలని అర్జీ ఇచ్చా.

- అశోక్, దివ్యాంగుడు, రాయదుర్గం

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,302 మంది అంగన్‌వాడీలకు ఏపీ సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రాజెక్టు ఏపీసీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి విద్యా ఏడాదిలో 12 రోజులు ఆఫ్‌లైన్‌లో, 28 రోజులు ఆన్‌లైన్‌లో ఇలా మూడేళ్లలో 120 రోజులపాటు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ అందిస్తారని తెలిపారు. ప్రాథమి స్థాయిలో పిల్లలకు భాష, గణిత నైపుణ్యాలు పెంపొందింపజేసేలా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనునట్టు స్పష్టం చేశారు. మండల స్థాయిలో జరిగే ఈ శిక్షణను ఏ మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు అదే మండలంలో అందిస్తామన్నారు. మండల విద్యాశాఖాధికారులు కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ నెల 18వ నుంచి 25వ తేదీ వరకూ (21, 23వ తేదీల మినహా) ఆరు రోజులపాటు అంగన్‌వాడీలకు శిక్షణ ఉంటుందని, అందరూ హాజరకావాలన్నారు.

సమ్మెలోకి 'శ్రీరామిరెడ్డి' కార్మికులు

- ఉమ్మడి జిల్లాలో 750 గ్రామాలకు కష్టాలు



కళ్యాణదుర్గం పంప్‌హౌస్‌లో మోటార్లను ఆఫ్ చేస్తున్న కార్మికులు

7

రైళ్లు కావాలి..!



- రాజధానికి వెళ్లాలంటే కష్టాలు..!
- నెలముందే ప్లానింగ్ చేసుకోవాలి..
- రిజర్వేషన్ దొరికినా తప్పని తిప్పలు
- పది రెట్లు పెరిగిన రద్దీ
- కొత్తవి రావు.. ఉన్నవీ రద్దు..

- వివరాలు 6లో...

ముందుకు సాగని ఏఓల ప్రమోషన్లు..!

ఎంపీడీఓ ఆఫీసుల్లో నాలుగు పోస్టుల ఖాళీ

22మంది సీనియర్ అసిస్టెంట్లతో ప్యానల్ రెడీ

పలు అభ్యంతరాలు రావడంతో బ్రేక్



అనంతపురం విద్య, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియ ముందుకుసాగకపోవడంతో పోస్టుల భర్తీ పెండింగ్ పడుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఖాళీగా నాలుగు 4 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని చూశారు. దీనికి సంబంధించి సీనియర్ అసిస్టెంట్స్ ప్యానల్ సీనియారిటీ జాబితా సిద్ధం చేసింది. అయితే అందులో అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ ప్రక్రియను పక్కనబెట్టారు.

ప్యానల్‌పై అభ్యంతరాలతో ఆగిందా..?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయం, ఎన్పీకుంట ఎంపీడీఓ కార్యాలయం, అగళి ఎంపీడీఓ కార్యాలయం, సోమందేపల్లి ఎంపీడీఓ కార్యాలయాల్లోని ఏవో పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ నాలుగు ఏఓ పోస్టులను సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్ల ఇచ్చి భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో 2024-2025 ఏడాదికి సంబంధించిన 22మందితో కూడిన సీనియర్ అసిస్టెంట్ల ప్యానల్ లిస్టు(తాత్కాలికం)ను ఇటీవల జడ్పీ అధికారులు సిద్ధం చేశారు. ఈ ప్యానెల్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ కార్యాలయాలకు జడ్పీ అధికారులు ఉత్తర్వులు పంపారు. ఈప్రక్రియను జడ్పీ అధికారులు తీవ్ర జాప్యం చేసినట్లు తెలిసింది. కుంటిసాకులు చెబుతూ అయినవాళ్లకు పట్టంకట్టాలన్న ధోరణిలో కొందరు జడ్పీ ఉద్యోగులు చక్రం తిప్పడంతో అనర్హులను సైతం ప్యానల్‌లో పెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్యానల్ సిద్ధం చేయడంలో కూడా కొన్ని తప్పులు జరగడంతో కొందరు ఉద్యోగులు అభ్యంతరాలు తెలిపినట్లు సమాచారం. గత ఏడాది డిసెంబరులోనే ప్యానల్ సిద్ధమైనా ఇప్పటి వరకూ ఫైనల్ ప్యానల్ జాబితాను సిద్ధం చేయలేదు. ఫలితంగా ఏవోల ప్రమోషన్ల ప్రక్రియ ముందుకు కదలడం లేదు.

ప్యానెల్ పరిశీలించి పరిష్కరిస్తాం

గతంలో తాత్కాలిక ప్యానల్ రెడీ చేశారు. కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. వాటిని పరిశీలిస్తున్నాం. డిప్యూటీ సీఈఓతో కొంత చర్చించి ప్యానల్ లిస్టును సిద్ధం చేస్తాం. ఏవోల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తాం.

-రామచంద్రారెడ్డి, సీఈఓ, జడ్పీ

పాడికి ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వం చొరవ

పశువైద్య శిబిరాలు విజయవంతం

ఆవులు, గేదెలు, ఎద్దులకు నట్టల నివారణ మందు

గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్

రైతుల్లో హర్షం



పశు ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉచితంగా పశుగ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చింది. పశువులు, జీవాలకు మినీగోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ పేరుతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడుతోంది. పాడి పశువులకు ఉపయోగపడేలా గోకులం షెడ్ల నిర్మాణాలను చేపట్టింది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణకు అవసరమైన వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7,900 పశువులకు నట్టల నివారణ మందు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాడి పశువులకు కనీస ఆదరణ లభించలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక పాడి పరిశ్రమకు ప్రోత్సాహం లభిస్తోంది. మూగజీవాలను బతికించాలన్న లక్ష్యంతో పశువైద్యశిబిరాలు నిర్వహించింది. మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు విజయవంతమయ్యాయి. మండలవ్యాప్తంగా ఆవులు, ఎద్దులు 7,900, గేదెలు, దున్నలు 4,200, గొర్రెలు 72,500, మేకలు 7,900, కోళ్లు 5,000, పందులు 40 పెంపుడు కుక్కలు 600 ఉన్నాయి. గాలికుంట వ్యాధి సోకకుండా 7,900 పశువులకు నట్టల నివారణ మందు తాపించినట్లు మండల పశువైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. ఎన్నడూలేని విధంగా పెద్ద పశువులకు నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేసింది.

పశువైద్య సేవలను వినియోగించుకోవాలి

పాడి రైతులు ఉచిత పశువైద్య సేవలు వినియోగించుకోవాలి. పశుసంతతి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వం మందులను అందుబాటులో ఉంచింది. పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేశాం.

-వెంకటరెడ్డి, పశువైద్యాధికారి, బొమ్మనహాళ్

బాధ్యతల స్వీకరణ



ఎస్ఈ శేషాద్రి శేఖర్

అనంతపురంరూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈగా శేషాద్రి శేఖర్‌ను నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కళ్యాణదుర్గం డివిజన్ ఈఈగా పనిచేస్తూ పదిరోజుల కిందట ఉద్యోగోన్నతి పొంది తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లారు. ఈక్రమంలోనే ఈయనను జిల్లా ఎస్ఈగా నియమించారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సంపత్ కుమార్‌ను కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని సీఎండీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంపత్ కుమార్ గత ఏడాది జూలైలో బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలకే ఈయన్ను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

రైళ్లు కావాలి..!

రాజధానికి వెళ్లాలంటే కష్టాలు..!

- నెలముందే ప్లానింగ్ చేసుకోవాలి..
- రిజర్వేషన్ దొరికినా తప్పని తిప్పలు
- పది రెట్లు పెరిగిన రద్దీ
- కొత్తవి రావు.. ఉన్నవీ రద్దు..



గుంతకల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత విజయవాడకు రైళ్లలో రద్దీ పదింతలు పెరిగింది. తగినన్ని రైళ్లు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. నవ్యాంధ్ర ఏర్పాటు తర్వాత బెజవాడ ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. కళాశాలలు, కోచింగ్ సెంటర్లకు రాష్ట్ర రాజధాని ఆలవాలమైంది. హైదరాబాద్ నుంచి కూడా సీఏ, నీట్, ఐఐటీ, జేఈఈ కోచింగ్ కోసం విజయవాడకు విద్యార్థులు కుప్పలుతెప్పలుగా వస్తున్నారు. రాయలసీమ జిల్లాల నుంచి కూడా విద్యార్థులు వెళ్తున్నారు. వారిని చూసి రావడానికి, తీసుకురావడానికి, వదలడానికి, వెళ్లడానికి విద్యార్థుల తల్లిదండ్రులు రైలు బెర్త్‌ల కోసం పెద్ద కసరత్తే చేయాల్సి వస్తోంది. రిజర్వేషన్ దొరికినంత మాత్రాన ఇబ్బందులు ఉండవులే అనుకుంటే తప్పులో కాలేసినట్లే. స్లీపర్ కోచ్‌లన్నీ వెయిటింగ్ లిస్టు ప్యాసింజర్లతో కిటకిటలాడుతుంటాయి. టాయిలెట్లు సైతం బెర్త్ లభించని ప్రయాణీకులతో నిండిపోయి ఉంటాయి. రైలు బెర్త్ దొరక్కపోతే బస్సులో వెళ్లడం కూడా ఓ యజ్ఞంగా మారుతుంది. విజయవాడకు సరైన బస్సుల్లేక రైల్వే డివిజన్ కేంద్రంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. విజయవాడకు వెళ్లాలంటే నెల ముందే ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలి. లేదంటే కష్టాలు తప్పవు. గుంతకల్లు రైల్వే జోన్ దక్షిణ మధ్య రైల్వే నుంచి సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి మార్చిన తరువాతైనా గుంతకల్లు-విజయవాడ మధ్య రైళ్ల పరుగు పెడతాయేమోనని స్థానికులు, జిల్లా వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు.

ఆ రెండు రైళ్లే గతి

రైల్వే డివిజన్ కేంద్రమైన గుంతకల్లు రైల్వే జంక్షన్ నుంచి కేవలం రెండంటే రెండు డెయిలీ ట్రెయిన్లే ఉండటంతో విజయవాడకు రిజర్వేషన్ దొరకడం గగనంగా మారింది. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నం. 18464), అమరావతి డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నం. 17226) రైళ్లు మినహా ఇతర రైళ్లేవీ గుంతకల్లులో రైలెక్కేవారికి పెద్దగా ఉపయోగకరంగా లేవు. వీటిలో ప్రశాంతి భువనేశ్వర్ వరకూ వెళ్తుండటంతో కర్నాటక, ఏపీ, ఒడిశా రాష్ట్రాలవారు ఇందులో ప్రయాణిస్తారు. ఈ కారణంగా రైలు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది. ఇందులో నెల ముందు కూడా రిజర్వేషన్ దొరకదు. 60 రోజుల ముందు రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభమౌతుండగా.. నాలుగైదు రోజుల్లోనే బెర్తులు భర్తీ అయిపోతున్నాయి. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పోలిస్తే హుబ్లీ-నరసాపూర్ వెళ్లే డెయిలీ ఎక్స్‌ప్రెస్‌లో పరిస్థితి కొంత నయంగా ఉంటోంది. ఈ రైలు తక్కువ దూరం ప్రయాణిస్తున్నందున, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పోలిస్తే రిజర్వేషన్లు ఇందులో సులభంగా లభిస్తాయి. సాధారణ రోజుల్లో పక్షం ముందు రిజర్వేషన్ ఈ రైలుకు దొరికే పరిస్థితులున్నాయి. కాగా అర్ధరాత్రి దాటాక గుంతకల్లుకు వచ్చే హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ (17329) రైలు మధ్యాహ్నం విజయవాడకు చేరుకుంటుండటంతో స్థానికులు ఆ రైలులో వెళ్లడానికి ఆసక్తి చూపట్లేదు. అలాగే వాస్కో-హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు మీదుగా వెళ్తున్నా.. ఇది వారంలో 4 రోజులు మాత్రమే నడుస్తుండటంతో అవసరానికి ఉపయోగపడటంలేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

గుత్తిలోనూ సమస్యే..

గుంతకల్లు మీదుగా కాకుండా గుత్తి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లే రైళ్లు కొన్ని ఉన్నా అక్కడి ప్రజలకు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. గుత్తి మీదుగా వెళ్లే ధర్మవరం-మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైలు (నం. 17216) ఇంజిన్ చేంజింగ్ కారణంగా ఆలస్యమవుతోందని చెప్పి గుత్తి ఫోర్ట్ స్టేషన్ మీదుగా బైపాస్ లైన్‌లో పంపుతున్నారు. దీంతో గుత్తి పట్టణవాసులకు ఈ రైలులో వెళ్లడం సమస్యగా మారింది. అలాగే కొండవీడు ఎక్స్‌ప్రెస్ (నం. 17211/12) రైలు వారంలో 3 రోజులు మాత్రమే నడుస్తుండటంతో విజయవాడకు వెళ్లడానికి అవసరానికి ఉపయోగపడకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్ గుత్తి-పెండేకల్లు రూటులో వెళ్తుండగా ఆ రైలు గుత్తి స్టేషన్‌లోకి తెస్తున్నారు. మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ ఎర్రగుంట్ల-నంద్యాల సెక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉండటంతో దీనిని గుత్తి స్టేషన్‌కు తేకుండా గుత్తి ఫోర్టు స్టేషన్‌లో ఆపి బైపాస్‌లో పంపుతున్నారు. మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి జంక్షన్‌లోకి తెస్తే ఇంజిన్‌ను వెనుక వైపునకు మార్చాల్సి ఉండడంతో ఆలస్యం అవుతుందన్న కారణంగా ఆ రైలును గుత్తి ఫోర్టుకే పరిమితం చేశారు. ఆలస్యం అయినాకానీ ఆ రైలును గుత్తికి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలి

రాష్ట్ర రాజధానికి వెళ్లే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రైళ్ల సంఖ్య, కొన్ని రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని రాయలసీమ జిల్లాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నడిచిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు, హుబ్లీ-విజయవాడ ప్యాసింజరును పునరుద్ధరించాలని అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల ప్రజలు కోరుతున్నారు. విశాఖపట్టణం-తిరుపతి-కదిరి-ధర్మవరం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకూ పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవేకాక గుంతకల్లు రైల్వే డివిజన్ సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లోకి మారినందున విశాఖ-విజయవాడ-గుంటూరు-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ పెంచాల్సిన పరిస్థితుల్లో కొత్త రైళ్లను నడపాలని డిమాండ్లు ఉన్నాయి. ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్, ఫాస్ట్ ప్యాసింజరు రైళ్లను ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. గుంతకల్లు నుంచి ప్రారంభమై విశాఖ వరకూ వెళ్లే ఎక్స్‌ప్రెస్, ప్యాసింజరు రైళ్లను ఏర్పాటుచేయాలని రైల్వే ఉద్యోగులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం నరకమే

విజయవాడకు వెళ్లి రావడానికి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఏమాత్రం అనువుగా ఉండదు. రిజర్వేషన్ దొరకదు, దొరికినా అడుగు వెయ్యలేని విధంగా వెయిటింగఖ లిస్టు ప్రయాణికులు టాయిలెట్ల వరకూ కిక్కిరిసి కూర్చుని ఉంటారు. పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్త రైళ్లను నడపాలి. నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలి.

-తారకేశ్వర్, ఎల్ఐసీ ఉద్యోగి, గుంతకల్లు

మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి జంక్షన్‌లోకి నడపాలి..

గుత్తి ఫోర్టు మీదుగా వెళ్తున్న మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి రైల్వే జంక్షన్‌లోకి తీసుకురావాలి. గుత్తి ఫోర్టు స్టేషన్‌కు వెళ్లి రైలెక్కడం కష్టంగా ఉంటోంది. అలాగే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అసలు ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి గుత్తి మీదుగా గుంతకల్లు వరకూ పొడిగించాలి.

-సుధీర్, గుత్తి



కలవర పెడుతున్న జీబీఎస్

ఆరునెలల క్రితమే రెండు కేసులు

సాధారణ వైద్యంతోనే అప్పుడు నయం

జిల్లా ఆసుపత్రిలో అప్రమత్తం

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జీబీఎస్ (గులియన్ బారే సిండ్రోమ్) వ్యాధి జిల్లా వాసులను కలవరపెడుతోంది. ఈ వ్యాధి ముందు నుంచి ఉన్నా అపుడు పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రస్తుతం ఈవ్యాధి బారిన పడినవారు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో పాటు రాష్ట్రంలోని ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు చనిపోవడం.. రోజురోజుకు కేసులు పెరుగుతుండడంతో ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో ఆరు నెలల క్రితమే ఈ వ్యాధి లక్షణాలు ఉన్న ఇద్దరు రోగులు వృద్ధుడు, బాలుడు జిల్లా ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది కోలుకుని వెళ్లినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చెబుతున్నారు. తర్వాత ఇప్పటి వరకు అలాంటి కేసులు ఆసుపత్రికి రాలేదనంటున్నారు. ఇపుడు రాష్ట్రంలో జీబీఎస్ ప్రభావం అధికంగా కనిపిస్తుండడం, ఇంతకు ముందే జిల్లాలోను ఇలాంటి కేసులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. ఇది అంటువ్యాధి కాదంటున్నా ప్రజలు భయపడుతున్నారు. దీంతో జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్న ప్రతి రోగిపై డాక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టారు. జీబీఎస్ లక్షణాలు ఉన్నాయా అని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఇక్కడ జీబీఎస్ కేసులు లేకపోయినా ప్రతిరోజూ రాష్ట్రశాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఎలాంటి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయలేదని ఆయన తెలిపారు. వ్యాధి విషయంలో ఆసుపత్రిలో అప్రమత్తంగా ఉన్నామని, అవసరమైన వైద్యం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆయన అన్నారు.



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై ధాన్యం రాసులు పోసుకొని ఆందోళన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, రైతులు

గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

అనంతపురం కల్చరల్, టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2024-25 ఖరీఫ్, రబీ పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ ముందు పప్పుశనగ, జొన్న, మిరప పోసి రైతులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు క్లాక్‌టవర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పప్పుశనగ సుమారు 57వేల హెక్టార్లలో సాగు చేశారన్నారు. అయితే అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఒక ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు సైతం రాక రైతులు ఆందోళనలో పడ్డారన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.20వేలు పంటనష్ట పరిహారమందించాలని కోరారు. ప్రస్తుతమున్న మద్దతు ధర క్వింటాకు రూ.5650ల ధరను రూ.10వేలకు పెంచి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, బీహెచ్ రాయుడు, రాజారాంరెడ్డి, మధుసూదన్, రైతుసంఘం నాయకులు పోతులయ్య, వెంకటేష్, నారాయణరెడ్డి, నాగమ్మ పాల్గొన్నారు.

ఎంఏ షరీఫ్ నేడు జిల్లాకు రాక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మైనార్టీ అఫైర్స్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ మంగళవారం జిల్లాకు రానున్నారు. ఉదయం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. 10 గంటలకు కళ్యాణదుర్గం చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 2.00 గంటలకు అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకొని.. 3 గంటలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి, జిల్లా అధికారులతో సమావేశమవుతారు.

వందల నుంచి పదుల్లోకి..

- కనుమరుగవుతున్న అంజూర సాగు
- ఒకప్పుడు వందల ఎకరాల్లో పంట
- వాతావరణ మార్పు, గిట్టుబాటు లేక కుదింపు



అంజూర పంట

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అంజూర పంట సాగు కనుమరుగవుతోంది. దశాబ్దకాలం కిందట ఇక్కడ వందలాది ఎకరాల్లో అంజూర సాగయ్యేది. ఇపుడు కనుచూపు మేరలో పంట కానరావడం లేదు. ముఖ్యంగా బొమ్మనహాళ్ మండలంలోని ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఒకప్పుడు వందలాది ఎకరాల్లో పంట సాగయ్యేది. ఇక్కడి నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తూ వచ్చింది. అలాంటిది వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అంజూర పంట కానరాని పరిస్థితి ఏర్పడింది.

విదేశాలకు ఎగుమతి

ఇక్కడి రైతులు అంజూరపంట సాగులో మెలకువలు తెలుసుకుని, అధిక దిగుబడులు సాధించారు. పండిన పంటను కూడా విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు లాంటి ప్రాంతాలకు పంటను తరలిస్తూ రూ.లక్షల ఆదాయాన్ని గడించారు. ముఖ్యంగా ఉద్యానపంటల సాగుకు చిరునామాగా ఉన్న ఎల్‌బీనగర్ నుంచి అంజూర పంటను ఎక్కువగా పండించి కాయలు పెద్దసైజులో ఉండేలా జాగ్రత్తలు పాటించి విదేశాలకు ఎగుమతి చేసేవారు. పైగా సుదూర ప్రాంతాల నుంచి అంజూర కొనుగోలు చేయడానికి, పంటలను పరిశీలించడానికి, అవగాహన పొందడానికి ఇక్కడికి అనేకమంది వచ్చేవారు. అలాంటి పరిస్థితి పూర్తిగా తారుమారైంది. గిట్టుబాటు కాకపోవడంతో రైతులు కూడా అంజూర పంటకు స్వస్తి చెప్పి, మొక్కజొన్న లాంటి పంటలను సాగుచేస్తున్నారు.

మార్కెటింగ్ సమస్య

పండించిన అంజూరను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎగుమతి చేసే పరిస్థితి లేదు. దీనికి ప్రధానంగా అంజూర పంట దిగుబడిలో వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉంది. బోరుబావి ద్వారా వచ్చే నీటిలో క్రమేపి ఉప్పుశాతం పెరిగి, దాని ప్రభావం పంటపై పడుతోంది. పండించిన అంజూరను ఒక్కరోజులోనే అమ్మకం చేసేలా మార్కెటింగ్ ఉండాలి. పంట దిగుబడి వచ్చినప్పటికీ కిలో ధర రూ.50లకు మించి మార్కెట్‌లో అమ్మడం కుదరడం లేదు. కనీసం కిలో రూ.80 ఉంటేగానీ గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు. దీంతో పాటు కాయలు పెద్దసైజులో రావడం లేదు. అంజూర పంను పెద్ద పెద్ద నగరాల చుట్టుపక్కల ప్రాంతాల్లోనే పండిస్తున్నారు. దీంతో ఇక్కడి నుంచి రవాణా చేసి అక్కడి మార్కెట్‌కు అందించడం కష్టంగా మారుతోందని పంట సాగును వదిలేస్తున్నారు. టమోటా పంటలాగా కోత చేసిన వెంటనే అంజూర కూడా అమ్మకం చేసుకోవాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నించినా ఏమాత్రం మార్కెట్ సౌలభ్యం లేదు. అందుకే అంజూర పంటపై ఆసక్తిని తగ్గించారు. ప్రస్తుతం బొమ్మనహాళ్ మండలంలో 13, డీ.హీరేహాళ్ మండలంలో 2.4, కణేకల్లు మండలంలో 7.70 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే పంట సాగు ఉంది.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

అంజూర సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. ప్రభుత్వం ఉద్యానపంటలకు రాయితీలు అందించి, దీనిపై పూర్తిస్థాయిలో చైతన్యపరిస్తే రైతులు అంజూర సాగు వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. గత వైసీపీ పాలనలో రాయితీలన్నీ రద్దు చేయడంతో అన్నదాతలు అంజూర సాగుకు దూరమవుతూ వచ్చారు. డ్రిప్ సబ్సిడీ కింద అందించే పథకాన్ని పూర్తిగా రద్దు చేయడంతో పాటు ఉద్యాన అధికారుల అవగాహన సదస్సు కూడా లేకపోవడంతో రైతులు అంజూర సాగును వదిలేసే పరిస్థితికి చేరుకున్నారు.



ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నాం

కూటమి ప్రభుత్వంలో ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నాం. గత వైసీపీ పాలనలో ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఉద్యానపంటల్లో భాగమైన అంజూర కూడా తగ్గించేశాం. ఒకపుడు 35 ఎకరాల విస్తీర్ణంలో అంజూర పండించా. ఇపుడు కేవలం ఏడు ఎకరాలలో మాత్రమే పంట ఉంది. చాలా సమస్యలు ఉన్నప్పటికీ ఆ పంటను కాపాడుకుంటూ వస్తున్నా. ప్రభుత్వం రాయితీలు అందించి ఆదుకుంటే ఉద్యానపంటల సాగులో మళ్లీ పూర్వ వైభవాన్ని చూపిస్తాం.

-వెంకటేశ్వరరావు, రైతు, ఎల్‌బీనగర్

మార్కెటింగ్ సమస్య ఉంది

అంజూర పంటను పండించినప్పటికీ మార్కెటింగ్ పరంగా చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాం. రూ. లక్ష దాకా పెట్టుబడి పెట్టి రోజూ కూలీలను పెడితే మార్కెట్‌లో కిలో రూ. 50లకు కూడా అమ్ముడుపోవడం లేదు. గతంలో ఎకరా విస్తీర్ణంలో పంట పండిస్తే సంవత్సరానికి రూ.1.5లక్షల దాకా ఆదాయం వచ్చేది. ఇపుడు పెట్టుబడి వస్తే చాలనే పరిస్థితి ఉంది. ఇందుకు మార్కెటింగే ప్రధాన సమస్య. అంజూర పంట కనుమరుగు కావడానికి మార్కెటింగ్ కూడా ఒక కారణం.

- రాము, రైతు, ఎల్‌బీనగర్



క్రైం కార్నర్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య


రంజిత్‌కుమార్

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగోడు గ్రామంలో సోమవారం సాయంత్రం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రంజిత్‌కుమార్(26) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, తిప్పేరమ్మ దంపతుల రెండో కుమారుడు రంజిత్‌కుమార్ రెండేళ్ల క్రితం ఇంజనీరింగ్ పూర్తి చేసి బెంగుళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండురోజుల క్రితం స్వగ్రామం కలుగోడుకు వచ్చాడు. ఇంట్లోని ఓ గదిలో ల్యాప్‌టాప్‌తో ఉదయం నుంచి పనిచేసుకుంటూ ఉండేవాడని.. సాయంత్రం వెళ్లి తలుపులు తెరిచే చూసేలోగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేతికి వచ్చిన కొడుకు కళ్లెదుటే శవమై కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రంజిత్‌కుమార్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులు మాత్రం తమ కుమారుడు ఎందుకు చనిపోయాడో అర్థం కావడం లేదని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కిందపడి మహిళ దుర్మరణం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన కొల్లమ్మ(45) సోమవారం మధ్యాహ్నం ట్రాక్టర్ కిందపడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని చీపులేటి సమీపంలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని మడకశిరకు వస్తుండగా వజ్రపాళ్యం సమీపంలోని మార్కెట్‌యార్డు వద్దకు రాగానే ట్రాలీ బోల్టు కట్ అయ్యింది. దీంతో ఇసుకపై కూర్చొన్న కొల్లమ్మ కిందకు పడిపోవడంతో చక్రం కింద పడి, మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం-1లో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. మృతుడి వయసు 62 సంవత్సరాలు ఉంటాయన్నారు. మృతుడి వద్ద ప్రభుత్వ ఆసుపత్రి చీటీ ఉందని, అందులో అతడి పేరు ఆంజనేయులు అని ఉందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దారిదోపిడీ దొంగల అరెస్ట్


నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

హిందూపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జాతకాలను చెప్పే యువకుడిని బెదిరించి దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 14న పామిడి మండలం కొండాపురం గ్రామానికి చెందిన బుడగజంగం కుళాయప్ప అనే వ్యక్తి జాతకాలు చెప్తానంటూ ద్విచక్ర వాహనంపై హిందూపురం పట్టణంలోని ఎస్.సడ్లపల్లి గ్రామానికి వచ్చాడు. ఈ సందర్భంగా అదే గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన నాగరాజు, గంగాధర్, శివ కుమార్, వెంకటేశు కలిసి కుళాయప్ప ద్విచక్రవాహనం ఆపి తాళాలు లాక్కొని గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి చితకబాదారు. అంతటితో ఆగకుండా తమకు డబ్బు ఇస్తేనే వదులుతామని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బాధితుడు కుళాయప్ప చేసేదిలేక తన ఫోన్ పేలో ఉన్న మొత్తాన్ని బదిలీ చేసి అది చాలదు అని బెదిరించడంతో తమ బంధువులకు ఫోన్ చేసి వారి నుంచి నగదు వేయించుకొని వారికి బదిలీ చేశారు. రూ. 32,500 నగదు ఫోన్ వేయించుకున్నారు. ఆ తరువాత కుళాయప్పని వదిలేయడంతో బాధితుడు టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో నగదు పంపిన ఫోన్ పే నంబర్ల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టి పై నలుగురిని అదుపులోకి తీసుకొని కొన్ని ఆధారాలతో అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ. 33 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు చేధించడంలో చొరవచూపిన సీఐలు జనార్దన్, రాజగోపాలనాయుడు, ఆంజినేయులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మహిళపై అత్యాచారం.. ఇద్దరు యువకుల అరెస్టు

లేపాక్షి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళపై ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి అత్యాచారం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులు అశోక్, వెంకటేశ్‌ను అరెస్టు చేశామని ఎస్‌ఐ నరేంద్ర సోమవారం తెలిపారు. బాధిత మహిళకు కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఉంటున్న ఇంటి పక్కనే నివసిస్తున్నారు. పొరుగింటిలోని అశోక్ అనే యువకుడితో ఆమె చనువుగా ఉండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన ముగ్గురు పిల్లలను తల్లి వద్దకు పంపి, అశోక్, అతని స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి తన ఇంట్లో మద్యం సేవించింది. ఆ సమయంలో ఇద్దరూ తనపై అత్యాచారం చేశారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

టమోటా కిలో రూ. 12



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.12తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 275 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,500, సరాసరి రూ.14,250తో అమ్ముడుపోయినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 82 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పట్టుచీరల నుంచి స్ర్కాప్ వరకు...

అంతా జీరో..!



- అధికారులకు ప్రతినెలా రూ.40 లక్షలకుపైగా మామూళ్లు
- సంపాదనలో పోటీ పడుతున్న పన్నుల శాఖ అధికారులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురం పట్టణంలో అంతా జీరో వ్యాపారమే నడుస్తోంది. ప్రభుత్వానికి వస్తుసేవలపన్ను(జీఎస్టీ) చెల్లించకుండా వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. పన్నుల శాఖ అధికారులు ప్రతి నెలా రూ.40లక్షల వరకు తమ జేబుల్లోకి ముడుపులు వేసుకుంటూ, పన్ను వసూళ్లలో మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టణంలో పట్టు చీరల నుంచి గుజిరీ సామాన్ల స్ర్కాప్(తుక్కు)వరకు వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి. ఇక్కడ ఓ ఉన్నతాధికారి, ముగ్గురు డీసీటీఓలు, సీనియర్ అసిస్టెంట్లు మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. ఒకరు ఎక్కువ సంపాదిస్తున్నారని.. మరొకరికి మంటగా ఉంటున్నట్లు సమాచారం. దీంతో ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో విచారణకు ఆదేశించారు.

ఒకే బిల్లు మీద ఐదారు వాహనాలు

హిందూపురం పరిధిలో అనేక ఫ్యాక్టరీలున్నాయి. వాటి స్ర్కాప్(తుక్కు) నుంచి కడ్డీలు తయారు చేస్తారు. దీంతో ఆ తుక్కుకు కర్ణాటక రాష్ట్రంలో డిమాండ్ ఎక్కువ. ఇదంతా జీరో బిజినెస్సే. వాస్తవానికి వీటిపై 18శాతం జీఎస్టీ చెల్లించాలి. ఒకే బిల్లు మీద 5, 6 వాహనాలు తిరుగుతుంటాయట. అధికారులు మాత్రం నెల మామూళ్లతో ప్రశాంతంగా ఉంటున్నారు. ప్రతి నెలా అధికారులకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఆదాయం ఉంటున్నట్లు తెలిసింది.

పట్టుచీరల్లో బాగానే...

హిందూపురం పరిధిలో ముద్దిరెడ్డిపల్లి పట్టుచీరలకు కేంద్రం. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రతి రోజూ 25వాహనాల వరకు తిరుగుతుంటాయట. పట్టుచీరలపై 5శాతం జీఎస్టీ చెల్లించాలి. చీరలు ఖరీదైనవి కావడంతో ఆదాయం బాగానే ఉంటున్నట్లు సమాచారం. ఇందుకు గాను అధికారులు ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజు ప్రతి వాహనం నుంచి రూ.10వేలు ఇవ్వాల్సిందేనట. అలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అధికారులు జేబులు నింపేసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

వక్కలు, డీజిల్, కిరాణం..

కర్ణాటక నుంచి వక్కలు బాగానే రవాణా అవుతుంటాయి. వీటికి 18శాతం జీఎస్టీ చెల్లించాలి. ఇది కూడా జీరో బిజినెస్సే. కిలో రూ.400లు ప్రకారం విక్రయించే ఈ వక్కలు ఒక్కో వాహనంలో 16టన్నుల వరకు తీసుకెళ్తుంటారు. ఓ వాహనం నుంచి ఓ డీసీటీఓ ఒకే సారి రూ.12లక్షలు పుచ్చుకున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పై అధికారి మండిపోయారట. తనకు తెలియకుండా ఎక్కువ ఆదాయం పుచ్చుకోవడం ఆ అధికారికి ఇష్టం లేక అందరిపై మండిపడినట్లు తెలిసింది. ఇక డీజిల్ అక్రమంగా రవాణా జరుగుతున్నా రాజకీయ ప్రమేయం ఉండటంతో కిక్కురుమనకుండా ఉంటున్నారనే విమర్శలున్నాయి. కానీ పన్ను రూపంలో మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇక కిరాణా, ఇతర చాలా వ్యవహారాల్లో నెలమామూళ్లు పుచ్చుకుంటున్నారని సమాచారం.

విచారణ పూర్తి... నివేదిక కమిషనర్‌కు..

పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో జరుగుతున్న అవినీతి పంచాయితీపై విచారణ పూర్తయింది. అక్కడ జరుగుతున్న వ్యవహారంపై నివేదిక పంపినట్లు సమాచారం. ఇప్పుడు ఆ నివేదికలో ఏముందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. గత కొన్ని రోజులుగా అధికారులు, సిబ్బంది చేసుకుంటున్న పరస్పర ఆరోపణల నేపథ్యంలో విషయం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు చేరింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అడిషనల్ కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించారు. సోమవారం అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, జాయింట్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణలు సోమవారం హిందూపురం వెళ్లారు. జీఎస్టీకి సంబంధించిన రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. కొందరు డీలర్లతో విచారణ చేసినట్లు సమాచారం. సీటీఓ, డీసీటీఓ, ఏసీటీఓ, సీనియర్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా విచారించినట్లు తెలిసింది. అనంతరం తుది నివేదికను ఆ శాఖ కమిషనర్‌కు పంపినట్లు సమాచారం.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

అధికారలాంఛనాలతో అంత్యక్రియలు

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగను పట్టుకోబోయి.. ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మృతిచెందిన బీఎ్‌సఎఫ్ జవాన్ లక్ష్మన్నకు ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పట్టణవాసులు సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. బీఎస్ఎఫ్ సిబ్బంది సైనిక విమానంలో ఆయన పార్థివ దేహాన్ని బెంగళూరుకు తీసుకువచ్చారు. అక్కడి ఆర్మీ క్యాంపు ఆఫీసులో సైనిక వందనం నిర్వహించి, రోడ్డు మార్గాన బ్రహ్మసముద్రానికి ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. తహసీల్దార్ సుమతి, జడ్పీటీసీ ప్రభావతి, ఎంపీడీవో నందకిషోర్, టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు అధికారులు, నాయకులు సంతాపాన్ని తెలియజేశారు. మండల ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు. అనంతరం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగేంద్ర కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్మన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజలు


గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

ముదిగుబ్బ ఎంపీపీపై కేసు

- రియల్టర్‌పై దాడి చేసినందుకు..

పెనుకొండ రూరల్/అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్‌పై కియ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేష్ సోమవారం తెలిపారు. అమ్మవారిపల్లి సమీపంలో ప్రభాకర్ అనే రియల్ వ్యాపారి భూమిలో వెంచర్ వేస్తుండగా ఆదినారాయణ యాదవ్ తన అనుచరులతో ఆదివారం వెళ్లి దాడి చేశారని ఆయన తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదినారాయణ యాదవ్, ఆయన అనుచరులు ఐదుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఆదినారాయణ యాదవ్‌పై మూడునెలల క్రితం కూడా ఒక కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. కియ ఇండస్ట్రియల్ ఏరియాలో భూముల క్రయ విక్రయాలలో ఆదినారాయణ యాదవ్ మోసం చేశారని రైతులు అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ తెలిపారు. దీంతో ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు.

అసత్య ప్రచారం: ఎంపీపీ

కియ సమీపంలో 250 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని ఆదినారాయణ యాదవ్ అన్నారు. అందులో ప్రభాకర్, విష్ణువర్ధన్, తాను భాగస్వాములమని తెలిపారు. తన భూమిని కాజేయాలని వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. అనంతపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన భూమిలో ప్రహరీ నిర్మిస్తున్నందుకు ప్రశ్నించానని, ప్రభాకర్ అనుచరులు తన అనుచరులపై దాడి చేశారని ఆరోపించారు. వారు భయపడి డయల్ 100కు ఫోన్ చేశారని, తాను సీఐకి ఫోన్ చేశానని అన్నారు. పోలీసులు తమ ఫిర్యాదును పక్కనపెట్టారని, తన భాగస్వాముల ఫిర్యాదును స్వీకరించి ఎఫ్ఆర్ఐ చేస్తున్నామని చెప్పారని అన్నారు. వివాదంలో మంత్రి సత్యకుమార్‌కు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నానని అన్నారు. ఎస్పీని కలిసి సమస్యను వివరిస్తానని అన్నారు.

యూనిక్ తంటాలు..!

డి-పట్టా రైతులకు కనిపించని ఆప్షన్

ఒకే సర్వే నంబరులో ఎక్కువ పేర్లున్నా అంతే..


నత్తనడకన సాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ


రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలిస్తున్న అనంతపురం ఏడీఏ రవి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అగ్రి స్టాక్‌లో (ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్) రైతుల వివరాల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రైతులకు యూనిక్ నంబర్ కేటాయింపునకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ నెల 7వతేదీ నుంచి జిల్లాలో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభమైంది. అయితే ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్ ముందుకు సాగడం లేదు. సాంకేతిక కారణాలు, మండలాల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని అంటున్నారు. జిల్లాలో 4 లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. ఇప్పటి దాకా 32,027 మంది రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేశారు. అత్యధికంగా గుంతకల్లు మండలంలో 2,994 మంది రైతులు వివరాలు నమోదు చేశారు. తాడిపత్రి 2,852, కణేకల్లు 2,534, పెద్దవడుగూరు 2,223, గుత్తి 2,049, యాడికి 1,901, విడపనకల్లు 1,800, పెద్దపప్పూరు 1,516, రాయదుర్గం 1,458, గార్లదిన్నె 1,303, పామిడి 989, గుమ్మగట్ట 962, బొమ్మనహాళ్ 832, నార్పల 820, కూడేరు 748, డి.హిరేహాళ్ 715, యల్లనూరు 677, అనంతపురం 529, బుక్కరాయసముద్రం 528, ఉరవకొండ 493, రాప్తాడు 475, బ్రహ్మసముద్రం 450, పుట్లూరు 443, కంబదూరు 419, ఆత్మకూరు 416, శింగనమల 413, బెలుగుప్ప 377, కల్యాణదుర్గం 324, శెట్టూరు 286, వజ్రకరూరు 266, కుందుర్పి 235 మంది రైతుల వివరాలను నమోదు చేశారు.

లక్ష్యం సాధ్యమేనా..?

పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో 30 శాతం మంది వివరాలను ఈ నెలాఖరులోగా నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 2.79 లక్షల మంది పీఎం కిసాన్ లబ్ధిదారులున్నారు. వీరిలో 30 శాతం అంటే 83,700 మంది రైతుల వివరాల నమోదు పూర్తికావాలి. దీనికి మరో 10 రోజులే గడువు ఉంది. ఆలోగా లక్ష్యం సాధ్యమేనా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. డి. పట్టా రైతుల వివరాలు నమోదు చేసే ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఒకే సర్వే నంబర్‌తో ఒకటి కంటే ఎక్కువ మంది రైతుల వివరాలుంటే, ఆ రైతుల పేర్లు కనిపించడం లేదు. జిల్లాలో ఎక్కువ శాతం సర్వే నంబర్లకు రైతుల పేర్లు డిస్‌ప్లే కాకపోవంతో ఏం చేయాలో తెలియక ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని సమాచారం.



ఆన్‌లైన్‌లో అగ్రిస్టాక్ వెబ్ సైట్

రిజిస్ట్రేషన్ ఇలా..

రైతులు తమ ఆధార్, పట్టాదారుల పుస్తకం, ఆధార్‌తో లింకైన సెల్ నంబర్‌ను రైతు సేవా కేంద్రాలకు తీసుకువెళ్లాలి. అక్కడి సిబ్బంది అగ్రిస్టాక్ వెబ్ సైట్‌లో రైతుల వివరాలతో రిజిస్ట్రేషన్ చేస్తారు. రైతు వివరాల నమోదులో భాగంగా తొలుత ఆధార్ వెరిఫికేషన్ కోసం ఒక ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత మొబైల్ వెరిఫికేషన్ కోసం మరో ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత ఈ సైన్ కోసం మరో ఓటీపీ అడుగుతుంది. మూడు ఓటీపీలు పూర్తైన తర్వాత రైతు రిజిస్ట్రేషన్ విజయవంతం అయినట్లు రైతు సెల్ నంబర్‌కు మరో సంక్షిప్త సమాచారం వెళుతుంది. ఆ మెసేజ్ వచ్చిన 48 గంటల తర్వాత 11 నంబర్లతో కూడిన యూనిక్ నంబర్ మెసెజ్ ద్వారా వస్తుంది.

మరింత వేగవంతం..

ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ నంబర్ రైతులందరికీ తప్పనిసరి. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తాం. డి. పట్టా భూములు, ఒకే సర్వే నంబర్‌తో పలువురు రైతుల పేర్లు ఉన్న వివరాల నమోదులో నెలకొన్ని సాంకే తిక సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. జిల్లాలో రైతులందరూ స్థానిక రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి యూనిక్ నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌ను రైతులు తీసుకువెళ్లాలి. అధికారులు, సిబ్బందికి రైతులు సహకరించి ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చొరవ చూపాలి.

-ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

వారాణసి వద్ద ప్రమాదం

- ఆగి ఉన్న బస్సును ఢీకొన్న లారీ
- కుంభమేళాకు వెళ్లిన తాడిపత్రివాసి మృతి
- మరో 11 మందికి గాయాలు


నాగలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నాగలక్ష్మి (55) కుంభమేళాకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తాడిపత్రి నుంచి సుమారు 40 మంది ప్రొద్దుటూరుకు చెందిన బస్సును మాట్లాడుకుని కుంభమేళాకు వెళ్లారు. త్రివేణి సంగమంలో స్నానం చేసి, పుణ్యక్షేత్రాలను చూసుకుని తిరుగుప్రయాణమయ్యారు. వారాణసి సమీపంలో శనివారం రోడ్డు పక్కన బస్సును ఆపి నిద్రించారు. ఆ తెల్లవారుజామున ఆగి ఉన్న బస్సును లారీ ఢీకొట్టింది. దీంతో బస్సులో నిద్రిస్తున్నవారు భయాందోళనకు లోనయ్యారు. బస్సు ధ్వంసమై.. పలువురు గాయపడ్డారు. కాసేపటి తరువాత స్థానిక పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డవారిని హైదరాబాద్‌కు తరలించారు. మార్గ మధ్యంలో నాగలక్ష్మి (55) మృతిచెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని నేరుగా తాడిపత్రికి తీసుకువచ్చామని భర్త రాజన్న తెలిపారు. గాయపడిన వారిలో అంజినమ్మ, బాలరంగయ్య, నాగలక్ష్మి, రామలక్ష్మమ్మ, అనసూయ, రమణ, లక్ష్మినారాయణ, సుబ్బలక్షుమ్మ తదితరులు 11 మంది ఉన్నారని తెలిపారు.

సమ్మెలోకి 'శ్రీరామిరెడ్డి' కార్మికులు

ఉమ్మడి జిల్లాలో 750 గ్రామాలకు కష్టాలు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. కళ్యాణదుర్గం పంపుహౌస్‌లో మోటార్లను సోమవారం రాత్రి 10.30 గంటలకు ఆఫ్ చేశారు. కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని 750 గ్రామాలకు నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ పథకంలో ప్రస్తుతం 630 మంది కార్మికులు, 20 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. ఫేస్-1, 4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 292 మంది కార్మికులు ఉన్నారు. నెలకు రూ.16,200 ప్రకారం ఆరు నెలల వేతనం రూ.2,83,82,400 రావాల్సి ఉంది. 30 నెలల పీఎఫ్ రూ.2,10,24,000 రావాల్సి ఉంది. ఫేస్-2 పరిధిలో హిందూపురం నియోజకవర్గంలో 52 మంది కార్మికులకు నెలకు రూ.14 వేల ప్రకారం 10 నెలల వేతనం రూ.72.80 లక్షలు, 10 నెలల పీఎఫ్ రూ.6.39 లక్షలు, పరిగి పరిధిలో 14 మందికి 30 నెలల పీఎఫ్ రూ.5,16,600 రావాల్సి ఉంది. ఫేస్-3 పరిధిలో మడకశిర నియోజకవర్గంలో 172 మంది కార్మికులు పనిచేస్తున్నారు. నెలకు రూ.14 వేలు ప్రకారం ఐదు నెలలకు రూ.12.40 కోట్లు, రూ.2,400 ప్రకారం పీఎఫ్ 10 నెలలకు రూ.41.28 లక్షలు రావాల్సి ఉంది. బకాయిలు చెల్లించేదాకా సమ్మెను విరమించేది లేదని కార్మికులు స్పష్టం చేశారు.

రాయల భాషా సేవ అజరామరం: వీసీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజైనా శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాషకు చేసిన సేవ అజరామరమని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. ఎస్కేయూలోని భువజన విజయం ఆడిటోరియంలో సోమవారం శ్రీకృష్ణదేవ రాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయ రంగ అభివృద్ధితోనే ఆర్థిక స్థితిగతులు మారుతాయని భావించిన శ్రీకృష్ణదేవ రాయలు అనేక చెరువులను తవ్వించాడన్నారు. భాష, సాంస్కృతిక, సంప్రదాయాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలుగుశాఖ ప్రొఫెసర్ నరసింహన్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ప్రొఫెసర్ తిప్పేస్వామి, కన్వీనర్ రామిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి సబ్సిడీ రుణ మేళా

గార్లదిన్నె/ శింగనమల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఈబీసీలు సబ్సిడీ రుణాల మం జూరు కోసం మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వ హిస్తున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 52 యూనిట్లు మం జూరు కాగా సుమారు 300కు పైగా దరఖాస్తులు వచ్చా యన్నారు. శింగనమల: మండలంలోని బీసీ, ఈబీసీలకు సబ్సిడీ రుణాల మంజూరుకు మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఆయా బ్యాంకుల పరిధిలోని గ్రామాల దరఖాస్తుదారులకు కేటాయించిన తేదీల్లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని వారు కోరారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటనాయుడు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళ, బుధవారాల్లో ఎ. నారాయణపురం-3 సచివాలయం, కందుకూరు, రాజీవ్‌కాలనీల్లో, 20, 21తేదీల్లో కురుగుంట, నర్సనాయనికుంట, ఉప్పరపల్లి, రాజీవ్‌కాలనీ, 24, 25 తేదీల్లో కక్కలపల్లి, ఆకుతోటపల్లి, అనంతపురంరూరల్ పంచాయతీ, చియ్యేడులో క్యాంపులు ఉంటాయన్నారు. అలాగే ఈ నెల 26 తేదీ ఎ. నారాయణపురం-5సచివాలయం, తాటిచెర్ల, 27, 28 తేదీల్లో రుద్రంపేట 1,2,3,4 సచివాలయాల్లో, అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని సచివాలయం-2, రాజీవ్‌కాలనీ, కామారుపల్లి సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సెలవులో రూరల్ తహసీల్దార్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తహసీల్దార్ మోహన్‌కుమార్ సెలవులో వెళ్లారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం సోమవారం నుంచి పదిహేను రోజుల పాటు సెలవు పెట్టినట్లు తెలిసింది. మార్చి మొదటి వారంలో తిరిగి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తహసీల్దార్ మోహన్‌కుమార్ సెలవులో ఉండటంతో అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హరికుమార్‌కు ఇన్‌చార్జ్ గా అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

రైతులకు యూనిక్ నెంబర్ తప్పనిసరి : ఏఓ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతి రైతుకు యూనిక్ నంబర్ (గుర్తింపు సంఖ్య)తప్పని సరి అని ఏఓ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న యూనిక్ నంబర్ నమోదు ప్రక్రియను సోమవారం ఏఓ పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 2200 మంది రైతులు యూనిక్ నెంబరు కోసం నమోదు చేయించుకున్నారని ఏఓ తెలిపారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఒకే భూమిని ఏడాది వ్యవధిలో ఓ మహిళ ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేయించిందని ఓ బాధితుడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని చంద్రబాబు నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు అందించాడు. వారం రోజుల క్రితం ఈసీ తీశానన్నాడు. తనకు భూమి విక్రయించిన నగరానికి చెందిన ఆ మహిళ, ఆ భూమిని ఆమె పెద్దకుమారుడికి అమ్మినట్లు అందులో తేలిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖలో డీఐజీ, డీఆర్‌లకు ఫిర్యాదు చేశానని అతడు తెలిపాడు.

ఆలయ నిర్మాణానికి నిధులివ్వండి

● టీటీడీ చైర్మన్‌తో పండమేటి ఆలయ కమిటీ సభ్యులు

రాప్తాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో నూతననంగా నిర్మిస్తున్న పండమేటి వెంకటరమణ స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు గంజిరాముడు తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామలరావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి పర్యవేక్షణలో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయ ని వారు టీటీడీ చైర్మన్‌కు వివరించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బట్టి నరసింహులు, చంద్ర పాల్గొన్నారు.

డీబీఎల్ఎన్ఎస్‌తో జేఎన్‌టీయూ ఒప్పందం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): లైవ్ ప్రాజెక్టులతో సాంకేతిక ఆధారిత శిక్షణ కోసం హైదరాబాద్ డీబీఎల్ఎన్ఎస్ సంస్థతో ఒప్పొందం చేసుకున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ సోమవారం తన కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు బాలు నాయక్, జీవన్‌కుమార్‌తో ఒప్పంద పత్రాన్ని మార్చుకున్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి భారతి, ప్రొఫెసర్‌లు శివకుమార్, ఈశ్వర్‌రెడ్డి, మాధవి, శోభాబింధు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలివ్వాలి: సీపీఐ

శింగనమల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలో రెండు సెంట్లను వెంటనే ప్రభుత్వం కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాణ్యం నారాయణస్వామి డిమాడ్‌చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నప్పయాదవ్, టి.నారాయణస్వామి, మధుయాదవ్, ఓబిలేసు, నేసే మధు, రామాంజినేయులు పాల్గొన్నారు..

'పల్లె పల్లెనా సీసీ రోడ్లు నిర్మిస్తాం'



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పల్లె పలెపల్లెనా సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత నిధులు మంజూరు చేస్తున్నారని మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. రాప్తాడులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద రూ. 17.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూ జ చేశారు. ముందుగా ధర్మవరం మురళి దంపతులు ఆల యం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కొండ ప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీడీఓ విజయలక్ష్మి, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, సాకే జయరాముడు, నారాయ ణ స్వామి, గోనిపట్ల శీనా, కిష్ట, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏఎంసీలో పడకల పెంపుపై కుస్తీ

● ట్రామా కేర్ సెంటర్‌లోనూ సీరియస్ కేసుల చికిత్సకు చర్యలు



ఏఎంసీలో అదనపు పడకల ఏర్పాటుపై పరిశీలిస్తున్న అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలోని అత్యవసర చికిత్సా విభాగం (ఏఎంసీ)లో పడకల పెంపు కోసం జిల్లా అధికారులు కుస్తీపడుతున్నారు. ఏఎంసీలో పడకల సంఖ్య తక్కువుగా ఉండడంతో సీరియస్ కేసులకు చికిత్సలు అందించ డానికి సమస్యలు ఏర్పడుతున్నాయని అదనంగా పడకలు ఏర్పాటుచేయాలని ఇటీవల కలెక్టర్ వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నతో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశించా రు. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి అదనపు పడకల ఏర్పాటుకు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఏఎంసీపైనే ట్రామా కేర్ సెంటర్ ఉంది. ఏఎంసీలో 20 పడకలు మాత్రమే ఉన్నాయి. నిత్యం అంతకన్నా ఎక్కువ సీరియస్ కేసులు వస్తుండడంతో, వారందరికీ ఏఎంసీలో చికిత్సలు అందించడానికి సాధ్యం కావడంలేదు. పడకల సమస్యల కారణంగా... రోగులు కొంతకోలుకున్న వెంటనే సాధారణ విభాగాల్లోకి తరలిస్తున్నారు. అక్కడ అత్యవసర చికిత్సలు అందక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇకపై అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఏఎంసీ పైభాగంలో ఉన్న ట్రామాకేర్ సెంటర్‌లో మరో 20 అదనపు పడకలు ఏర్పాటుచేసి, అక్కడ ఐసీయూ చికిత్సలు అందిస్తే బాగుంటుందనే ఆలోచనకు వచ్చారు. దీనిపై ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి సోమవారం ఏఎంసీలోని డాక్టర్లుతో కలిసి పరిశీలించారు. ట్రామాకేర్ సెంటర్‌లో పడకల ఏర్పాటుపైనా చర్చించారు. పడకలు పెంచితే ఈ రెండు విభాగాల లో ఉన్న సీరియస్ కేసులకు డాక్టర్లు చికిత్సలు అందించడానికి, పర్యవేక్షణ చేయ డానికి బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. త్వరలో ట్రామాకేర్ సెం టర్‌లో సీరియస్ కేసులకు చికిత్సలు అందించడానికి అదనంగా 20 పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మొత్తమ్మీద అదనపు పడకల ఏర్పాటుకు అడుగులు పడడంతో సీరియస్ కేసులకు అత్యవసర చికిత్సలు అందే అవ కాశం ఉంటుందని ఇటు డాక్టర్లు, అటు రోగులు అభిప్రాయ పడుతున్నారు.

వైసీపీ అసమర్థ పాలనకు సాక్ష్యం.. విరిగిన గేట్లు

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● పేరూరు డ్యాం సందర్శన



విరిగిన డ్యాం గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అసమర్థ పాలనకు సాక్ష్యం విరిగిన పేరూరు డ్యాం గేట్లే అని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆమె సోమవారంమండలంలోని అప్పర్ పెన్నార్ (పేరూరు) డ్యాంను సందర్శించారు. మరమ్మతులకు గురైన డ్యాం గేట్లను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షపు నీటితో జలాశయం నిండిన సమయంలో జాగ్రత్తలు తీసుకోకుండా, అవగాహన లేకుండా గేట్లు ఎత్తి వాటిని విరిగ్గొ ట్టారని విమర్శించారు. దీంతో డ్యాంలో చేరిన నీరు కాస్త వృథా అయిందన్నారు. గేట్లు విరిగిపోయిన తరువాత దాదాపు రెండేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వాటి మరమ్మతుల గురించి పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేరూరు డ్యాం గేట్లతో పాటు ఈ ప్రాజెక్టుకు నీరందించే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ప్రభుత్వం పేరూరు జలాశయం గేట్ల మరమ్మత్తులకు రూ.1.21కోట్లు మంజూరు చేసిందన్నారు. వారం రోజులుగా పనులు జరుగుతున్నాయన్నారు. విరిగిన గేట్ల భాగాలను బయటకు తీసి, వాటిని కర్నూల్‌కు తీసుకెళ్లి మరమ్మతులు చేయించామన్నారు. పేరూరు జలాశయానికి హంద్రీనీవా నీటిని తీసుకొస్తామని గత ప్రభుత్వంలో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కేవలం ప్రగల్బాలు పలికార న్నారు. అయితే దేవుడిదయతో వర్షం నీటితో డ్యాం నిండినా, అవగాహన లేమితో ఉన్న గేట్లను విరిగ్గొట్టడంతో ఆ నీరు వృథా అయిందన్నారు. దీంతో జలశాయంలోకి నీరు వచ్చినా నిల్వ ఉండని పరిస్థితి ఏర్పడిందన్నారు. గేట్ల మరమ్మతుల పనులు మూడునెలలో పూర్తి అవుతాయన్నారు. త్వరలో పేరూరుకు హంద్రీనీవా నీటిని తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు,, మండల కన్వీనర్ సుధాకర్, పేరూరు సాగునీటిసంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, స్థానిక నేతలు వడ్డి సుబ్బు, నాగరాజు, ముత్యాలు, రాధ, అదికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన టీచర్.. డీఈఓకు ఫిర్యాదు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదివే బాలుడిని హోంవర్క్ రాయలేదంటూ ఓ టీచర్ వాతలు పడేలా కొట్టారంటూ విద్యార్థి సంఘాల నేతలు డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, ఇతర నేతలు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హోం వర్క్ రాయలేదన్న కారణంగా మూడో తరగతి చదివే టీచర్ చితకొట్టడంతో ఆ విద్యార్థి శరీరంపై వాతలు పడ్డాయన్నారు. ప్రశ్నించిన తల్లిదండ్రులకు సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఆ పాఠశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షులు వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యపై సోమవారం ఎస్కేయూ ఎంబీఏ విభాగంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఓడీ ప్రొఫెసర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రభాకర్, శైలజ, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై రేపు అవగాహన సదస్సు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ యూనిట్లకు సంబంధించి ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై శింగనమల మండలం పెద్ద జలాలపురం ఆర్‌డీటీ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులోనే సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారులతో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయిస్తామన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సదస్సుకు పరిశ్రమలు స్థాపించాలనుకునే ఔత్సాహికులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీజేపీలోకి పలువురి చేరిక

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పలువురు సోమవారం బీజేపీలో చేరారు. బీజేపీ స్థానిక కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సీనియర్ నాయకులు చిరంజీవిరెడ్డి, కిరణ్ గౌడ్ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై అనేక మంది సాధారణ ప్రజలు బీజేపీలో చేరుతున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భూమి విక్రయం కేసులో ఒకరిపై నాలుగో పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చే శారు. నగరంలోని మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసులుకు తపో వనానికి చెందిన రఫీ రూరల్‌మండలంలోని నారాయణపురం పొలం లో ఎనిమిది సెంట్ల స్థలం చూపాడు. మొత్తం రూ. 26 లక్షలకు బేరం కుదుర్చుకుని అగ్రిమెంట్ రాయించుకున్నాడు. శ్రీనివాసులు ముందుగా రూ. 7.60 లక్షలు ఇచ్చాడు. కానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. అయితే ఆ స్థలానికి యజమాని మరొకరు ఉన్నారని తేలింది. దీంతో రఫీపై శ్రీని వాసులు ఫిర్యాదు మేరకు ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ కబ్జా ఘటనలో మరో ఐదుగురిపై కేసు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : భూ కబ్జాలకు పాల్పడుతున్న మరో ఐదుగురిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని విద్యారణ్యనగర్‌లో నివాసముంటున్న కొమర్ల విజయకృష్ణకు సర్వే నెంబరు 89/9లో మూడున్నర సెంట్లు, 90/5లో 12 సెంట్లు, 91/5లో 55.50 సెంట్లు, 91/6లో 12.50 సెంట్లు, 92/2లో 30.50 సెంట్లు కలిపి మొత్తం 114సెంట్లు పిత్రార్జిత ఆస్తి ఉంది. ఈ భూమికి పక్కనే ఈశ్వర్‌ప్రసాద్, క్రిష్ణమూర్తి, పసుపులేటి రామన్నకు చెందిన భూమి ఉంది. గత నెల30న కొందరు ప్రజాసంఘం ముసుగులో ఆ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, తాత్కాలిక గుడిసెలు నిర్మించారు. విషయం తెలిసిన బాధితులు ఆ భూమి వద్దకు వెళ్లగా కొందరు బెదిరించారు. విజయక్రిష్ణ ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు భూ కబ్జా సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ శాంతిలాల్ హెచ్చరించారు.

దాడి ఘటనపై...

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన దాడి ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక భాగ్యనగర్ రెండో క్రాస్‌కు చెందిన వరుణ్ తపోవనంలోని ఓ బైక్ షోరూమ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి కారులో తన ఇద్దరు స్నేహితులతో కలిసి బయలుదేరాడు. ఆర్టీసీ బస్టాండ్‌లో సమీపంలోకి రాగానే కారులో మాట్లాడుకుంటున్న వారిని ఐదోరోడ్డుకు చెందిన వేదిత్, జగదీష్ చూశారు. వారు తమ గురించే మాట్లాడుకుంటున్నారని భావించి, సమీపంలోని కావ్య లాడ్జివద్ద కారును ఆపి గొడవకు దిగారు. వరుణ్ తల మీద రాయితో కొట్టారు. రక్త గాయమైంది. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసు కొట్టివేత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 2011లో జరిగిన సినీతారల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా రాష్ట్ర ఒలంపిక్ సంఘం అప్పటి ఉపాధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డిపై పోలీసులు నాన్ బెయిల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఆటంకం కలిగించారని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ అనంతపురం జిల్లా మొబైల్ కోర్టులో సాగింది. మచ్చా రామలింగారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది అబ్దుల్ రెహమాన్ వాదించారు. అనంతపురం ఏఆర్ ఏఎస్పీ మురళీధర్ మచ్చా రామలింగారెడ్డిపై ఫిర్యాదు చేయగా, రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేశారు. 2011 సంఘటనపై పోలీసులు అక్రమంగా కేసు పెట్టారని, ఈ కేసులో మచ్చా రామలింగారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని నిర్దోషిగా తీర్పునిస్తూ జిల్లా మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్‌కుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఏఎస్పీ మరళీధర్, ఇతర పోలీస్ అధికారులు మచ్చా రామలింగారెడ్డికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగర శివారులో పేకాడుతున్న నలుగురిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీకాంత్‌కు అందిన సమాచారం మేరకు సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని కంపచెట్లలో పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 23,640 స్వాధీనం చేసుకున్నారు.

వేతనాల పెంపు కోసం అంగన్‌వాడీల నిరసన

● దశలవారీ పోరాటాలు : ఓబులు



సీకేపల్లిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం అర్బన్, రూరల్ ప్రాజక్టు కార్యాలయాల వద్ద సోమవారం సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ముత్తుజా, రామాంజినేయులు, అంగన్వాడీ యూనియన్ నేతలు అరుణ, రేవతి, నక్షత్ర తదితరులు మాట్లాడుతూ... 2019 నుంచి అంగన్‌డీలకు వేతనాలు పెరగలేదన్నారు. వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేస్తే, 2024 జులై నుంచి వేతనాలు పెంచుతామని చెప్పారన్నారు. నేటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు చెల్లించాలన్నారు. అదేవిధంగా ఇతర సమస్యలు పరిష్కరించాలని సీడీపీఓలకు వినతిపత్రం అందించారు.

● శింగనమల: అంగన్‌వాడీలకు వెంటనే గ్రాట్యుటీ అమలు చేయాలని, అంగన్వాడీల సమస్యలపై దశల వారీగా పోరాటలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర నాయకులు జి.ఓబులు అన్నారు. శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు భారతి, ప్రమీల, కాత్యాయని, శ్యామల,నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు...

● నార్పల/చెన్నేకొత్తపల్లి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిని వినతిపత్రాని కార్యా లయం లో అధికారికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలు శ్రీదేవి, రేణుకాదేవి, జయలలిత, కళావతి, రామాంజినమ్మ, సుధామణి, ప ద్మావతి, అనంత లక్ష్మి, శశికళ, రమాదవి తదితరులు పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారికి అందజే శారు. అంగన్‌వాడీల యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రమణమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవి, సెక్టారు లీడర్లు ప్రసన్న, కోమల, చాముండి, సరస్వతి, రామేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

● ఎస్పీకి ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



ఎస్పీ జగదీష్‌కు వినతి పత్రం ఇస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ సెంట్రల్ యూనివర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, కారకులను శిక్షించడంతో పాటు విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమం లో ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, ఎస్ఎఫ్ఐ నగరాధ్యక్షుడు భీమేష్, కార్యదర్శి శివ, ఉపాధ్యక్షుడు సోము తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్ : సెంట్రల్ యూనివర్సిటీలోని బాలికల హాస్టల్‌లో అమ్మాయిలకు రక్షణ కల్పించాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మాయిలను వేధింపులకు గురిచే స్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడిని సీకేపల్లి పోలీసులు కాపాడారు. సీకేపల్లికి చెందిన రామాంజినేయులు కుటుంబకలహాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్యచేసుకోవడం కోసం రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితుడు వెంటనే సమాచారాన్ని ఎస్ఐ సత్యనారాయణకు ఫోన్ ద్వారా తెలిపాడు. అప్రమత్తమైన ఎస్ఐ తన సిబ్బంది హరి, నరసింహను సంఘటనాస్థలానికి పంపారు. వారు ట్రాక్‌పై వెళ్తున్న యువకుడిని కాపాడారు. అనంతరం యువకుడితో కారణాలపై ఆరాతీశారు. అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల చొరవను స్థానికులు ప్రశంసించారు.

అనంత సాహితీ ప్రకాశం ఆశావాది

● జనప్రియ కవి ఏలూరి యంగన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి యంగన్న

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు అనంత సాహితీ ప్రకాశం అని జనప్రియ కవి ఏలూరి యంగన్న పేర్కొన్నారు. ఆశావాది ప్రకాశరావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మొదటిరోడ్డులోని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంకమౌళి, తెలుగు వెలుగు సాహితీ సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, నాయకులు అల్తాఫ్, సుబ్బరాయుడు, కేఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్: తెలుగు సాహిత్య మేటి పద్మశ్రీ ఆశావాది ప్రకాష్‌రావు అని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి పేర్కొన్నారు. ఆశావాది ప్రకాష్‌రావు వర్ధంతిని పురస్కరించుకుని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు ఆశావాది సుధామ వంశీ, వసంతగౌరి పాల్గొన్నారు.

చెరువును ఆక్రమించారని ఫిర్యాదు

గార్లదిన్నె, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మద్దతుదారుడైన ప్రసాద్ తహసీల్దార్ బండారు ఈరమ్మకు ఫిర్యాదు చేశారు. మండలపరిధిలోని కనుంపల్లికి చెందిన ప్రసాద్ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కనుంపల్లిలో చెరువుతో పాటు పక్కనే ఉన్న రెవెన్యూ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమించుకోవడంతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేశారని తెలిపారు. బోరు వేసే సమయంలో గ్రా మస్థులు అడ్డుకోగా కులం పేరుతో దుర్భాషలాడుతు బెదిరింపులకు దిగారని తెలిపారు. ఈ విషయంపై పో లీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. చెరువును, రెవెన్యూ స్థలాన్ని అక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సూపర్ సిక్స్ అమలుకు పోరుబాట : సీపీఐ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎన్నికల మ్యాని ఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వెం టనే అమలు కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పో రుబాట చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం మం డల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు. సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి గ్రామాల్లో పోరుబాట చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు అక్కులప్ప, గోవిందు, యుగంధర్‌రెడ్డి, ఓబులేసు, తిరుపాలు నాయక్, రెడ్డప్ప, కుళ్లాయప్ప, మహేష్, వెంకట రాముడు, వేణు, పాండు, విజయ్, రామాంజనేయులు, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

మరువకొమ్మ వద్ద సర్కిల్ ఏర్పాటు చేయాలి : సీపీఐ

శింగనమల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి హైవే నుంచి శింగనమలకు వెళ్లేందుకు మరువకొమ్మ వద్ద సర్కిల్ ఏర్పాటు చేయాలని సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారం సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. హైవే నుంచి నుంచి నియోజక వర్గ కేంద్రమైన శింగనమలకు వెళ్లాలంటే శివపురం పెద్దమ్మగుడి వద్దకు వెళ్లి రావాలన్నారు. మరువకొమ్మవద్ద రంగరాయల పేరు మీద సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు చిన్నప్పయాదవ్, టి.నారాయణస్వామి, మధుయాదవ్, చిన్నజలాలపురం ఓబిలేసు, రామాంజి నేయులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ ఉన్నా డబ్బులు అడుతున్నారని..



ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ఉన్నా జిల్లా కేంద్రంలోని సంఘమేష్ సర్కిల్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. ఆత్మకూరు మండలానికి చెందిన ఓ వ్యక్తిని అనారోగ్యంతో ఆ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందించడానికి ఆ ఆసుపత్రిలో ఒప్పుకున్నారు. అయితె మళ్లీ డబ్బులు అదనంగా కట్టాలని డిమాండ్‌చేయడంతో ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రోగి కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. ఒన్‌టౌన్ పోలీసులు అక్కడకు వెళ్లి వారితో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై వైద్యాధి కారులకు పిర్యాదు చేస్తామని, తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న స్వామివారు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌లో గల వెంకటేశ్వరస్వామి ఆలయం లో సోమవారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా అర్చకులు మూల విరాట్ పాదాలను సుగంధ ద్రవ్యాలు కలిపిన జలముతో అభిషేకించారు. స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 23 ఏళ్ల పూర్తయ్యాయని, ఇందుకుగాను ఈ ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

ఘనంగా గులాంషా ఖాద్రీ షంషీర్



షంషీర్‌ను గుర్రం మీద ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో హజరత్ గులాంషా ఖాద్రీ దర్గా 65వ ఉరుసు ఉత్సవాలలో భాగంగా సోమవారం షంషీర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామునే ముజావర్లు స్థానిక జామియా మసీదు నుంచి షంషీర్‌ను అశ్వంపై ఉంచి మేళతాళాల మధ్య పలు వీధుల్లో ఊరేగిస్తూ దర్గాకు చేర్చి స్వామికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మైలార లింగేశ్వరస్వామి రథోత్సవం

కుందుర్పి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనగల్లు గ్రామంలో సోమవారం మైలార లింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే అర్చకులు ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రాత్రి పది గంటలకు ఉత్సవమూర్తిని రథంపై ఉంచి పురవీధుల్లో లాగారు. రథోత్సవంలో గొరవయ్యలు నృత్యం చేస్తూ సందడి చేశారు. వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బెళుగుప్ప, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠను సోమవారం మళయాళ వేదపండితుడు శ్రీరంగం సరున్మోహన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు, ఆలయ ప్రాంగణంలో పలు హోమాలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

పామిడి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మండలకేంద్రంలో సోమవారం వామపక్ష పార్టీల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత నూతన ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో పలువురు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రైతులకు మొండిచేయి చూపిందన్నారు. ధనవంతులకు మాత్రమే ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని మండిపడ్డారు. సీపీఐ గుంతకల్లు కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీల నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం బడ్జెట్‌లో పేదలకు, రైతులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. వామపక్ష మండల కార్యదర్శులు రామదాసు, నిర్మల, నాయకులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

శెట్టూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ అమలు చేసే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి గౌసియా సోమవారం ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు సొంత ట్రాక్టర్ కలిగి ఉంటే మౌంటెడ్ స్ప్రేయర్లు 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఎస్సీ టార్గెట్ కింద కొత్త తోటల విస్తరణ, మల్చింగ్, స్టేకింగ్ పద్ధతిలో కూరగాయలు సాగు చేసే రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే రైతుకు మామిడి కి రక్షణ కవచం కూడా రాయితీతో అందిస్తారన్నారు. ఈ ఫ్రూట్ కవర్‌ని కాయ పిందెదశలో ఉన్నప్పుడు వాడాలని సూచించారు. దీనివల్ల పలు తెగుళ్లను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. అవకాశాన్ని ఉద్యానరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ పరిధిలో పనిచేసే ప్రతి ఉద్యోగి తమ కార్యాలయాలలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వారు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా ఉదయం 10 గంటల్లోపు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అనంతరం హౌస్ హోల్డర్స్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ కొండన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో 15 గొర్రెల మృతి

శెట్టూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకూరు పంచాయతీ మాలేటిపురం గ్రామంలో గోవిందప్పకు చెందిన 15 గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గోవిందప్ప ఆదివారం రాత్రి గ్రామసమీపంలోని ఓ పొలంలో చుట్టూ కంచె మాదిరిగా వేసి అందులోకి గొర్రెలను తోలాడు. కాగా సోమవారం తెల్లవారుజామున పైన ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తూ తెగి మీద పడడంతో షాక్ తగిలి 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో దాదాపు రూ. రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఘటనపై విద్యుత్ ఏఈ సలీంను వివరణ కోరగా.. విద్యుత్‌లేన్ల కింద జీవాలను ఉంచకూడదని తెలిపారు.

ఎట్టకేలకు తారు వేశారు..



పూర్తయిన రోడ్డు నిర్మాణం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండూరు, కళ్లదేవనహళ్లి, బొమ్మనహాళ్ రోడ్డుకు ఎట్టకేలకు తారువేశారు. ఆ రోడ్డుపై కంకర వేసి తారు వేయకుండా వదిలేయడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ రోడ్డుకు తారు వేసేది ఎప్పుడో అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే తారువేసే పనులు మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేశారు. ఇక ప్రయాణం సులభతరవవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధే.. అజెండా

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయరాం

పామిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధే అజెండాగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్, ట్రాన్స్‌ఫార్మర్, సీసీ రోడ్లను సోమవారం ఆయన టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామితో కలిసి ప్రారంభించారు. ముందుగా గాయత్రి కాలనీ, గుప్తాకాలనీ ప్రజలకు లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. అలాగే పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను, ఆ తర్వాత భోగేశ్వర స్వామి ఆలయం వద్ద సీసీ రోడ్డును ప్రా రంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తన దృష్టికి తేవాలని, వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్నామని అన్నారు. పామిడి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఉరకలేస్తోందన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా.. అభివృద్ధిలో ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదని అన్నారు. సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఈఓ గోపాల్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, ఎంపీటీసీ మాజీ సభ్యులు జింకల సంజీవకుమార్, తలారి మస్తానప్ప, జయకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● అంగన్‌వాడీల నిరసన



గుత్తిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

గుత్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సహాయ కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. వేతనాలు పెంపు కోసం అంగన్‌వాడీ సిబ్బంది గతంలో 42రోజుల పాటు చారిత్రాత్మకంగా సమ్మె నిర్వహించారని గుర్తు చేశారు. 2024 జూలై నుంచి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి నేటికీ పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నిర్మల, అంగన్‌వాడీ నాయకురాళ్లు రేష్మా, కల్యాణి, పార్వతి, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనాలు పెరగలేదన్నారు. ఇప్పటికైనా వేతనాలు రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు వేతనాలు రూ. 26 వేలు పెంచాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందించారు. తొమ్మిది డిమాండ్లతో కూడిన విన తిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకుడు నాగరాజు, అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు రామాంజినమ్మ, కార్యదర్శి లావణ్య, కోశాధికారి కరుణం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్నారు..

● సీపీఐ నాయకుడు చిరంజీవిపై టీడీపీ కౌన్సిలర్ల మండిపాటు



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీపీఐకి చెందిన చిరంజీవియాదవ్ స్థలాలు ఇప్పిస్తానని ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని టీడీపీ కౌన్సిలర్లు అబ్దుల్‌రహీం, విజయ్‌కుమార్, రేష్మాపర్వీన్, సరస్వతి, జింకాలక్ష్మీదేవి, అరుణ మండిపడ్డారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐలో చిరంజీవి ఒక చీడపురుగు అని దుయ్యబట్టారు. ప్రతివార్డులో సమావేశాలు పెట్టి స్థలాలు ఇప్పిస్తానంటూ ప్రజల నుంచి డబ్బులు గుంజడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ప్రజలకు ఎక్కడి నుంచి పట్టాలు ఇప్పిస్తావంటూ ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం పేదలతో కలిసి ధర్నా చేసి స్థలాలు ఇప్పిస్తానంటూ ఆయన డాంబికాలు పలుకుతున్నారని, కార్యాలయం వద్దకు తాము కూడా వస్తామని, చేతనైతే స్థలాలు ఇప్పించాలని అన్నారు. లేకపోతే అక్కడే తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అర్హులైన పేదలకు స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ ప్రారంభించారని వారు పేర్కొన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వినతి

రాయదుర్గంటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్టీల్ ప్లాంట్, పరిశ్రమల సాధన కమిటీ బీఎం నాదల్ కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన కలెక్టర్‌ను స్టీల్ ప్లాంట్, పరిశ్రమల సాధన కమిటీ బీఎం నాదల్ కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఏపీఐఐసీ భూముల్లో ఉక్కుపరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ ద్వారా సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు తగినచర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జాజరకల్లు వద్ద ఇతనయల్ పరిశ్రమలకు రాయితీ ప్రోత్సాహకాలు ఇవ్వాలని, పరిశ్రమల కొరకు సెజ్‌ల నిర్మాణం పనులు చేపట్టాలని , కుదిరేముఖ్ పరిశ్రమకు కేటాయించిన 700 ఎకరాల భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విన్నవించారు. స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ సభ్యులు కృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల భూములకు రక్షణ కల్పించాలి

బొమ్మనహాళ్: మండలంలో దేవాలయ భూములను కొందరు కబ్జా చేసి సాగుచేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. రాయదుర్గంలో కలెక్టర్‌ను వారు కలిసి మాట్లాడారు. మండలంలోని కృష్ణాపురం, ఉంతకల్లు, ఉద్దేహాళ్, కొళగానహళ్లి గ్రామాల్లో దేవాలయాలకు చెందిన కోట్లాది రూపాయలు విలువ చేసే భూములు కబ్జాలకు గురయ్యాయని తెలిపారు. ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. సీపీఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున, ఏపీ రైతు సంఘం తాలుకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, కొత్రేష్‌కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పౌరసరఫరాల గోదామును జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదాములో స్టాక్ వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను గోదాము ఇన్‌చార్జి ఎప్పటికపుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలని, రిజిష్టర్‌లో నమోదైన స్టాక్ పరిమాణము, గోదాములో నిల్వ ఉన్న స్టాక్ పరిమాణము ఒకే విధంగా ఉండేలా చూడాలని సూచించారు. సీసీ కెమెరాలు నిత్యం పనిచేస్తూ ఉండాలని చెప్పారు. ఎఫ్‌పీ షాపులకు సరుకులు నిర్ణీత సమయంలో సరఫరా చేయాలని తెలిపారు. న్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా భూరీసర్వే పనులను తనిఖీ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం లో రికార్డులను పరిశీలించారు. అక్కడి నుంచి బీటీ ప్రాజెక్టును పరిశీలించి స్థితిగతులను, ఆయకట్టు వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఐ లు సూర్యనారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాసుల తదితరులు ఉన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లిలో భూరీసర్వేను జేసీ శివనారాయణ శర్మ, ఆర్డీవో వసంత బాబు, తహసీల్దార్ సుమతి పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ ధర్నా



సర్పంచ్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కణేకల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మండలంలోని జక్కలవడికి గ్రామంలో వైసీపీ మద్దతు సర్పంచ్ శారదమ్మ ఇంటి ఎదుట సోమవారం ఎస్సీ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .. తమ కాలనీలో దాదాపు 120 కుటుంబాలున్నాయని, గత కొన్నేళ్లుగా తాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. వారం రోజుల నుంచి పూర్తిగా నీరు బంద్ అయ్యాయని అన్నారు. సమస్య వెంటనే పరిష్కరించాలంటూ డిమాండ్ చేశా రు. కాగా ఆ సమయంలో సర్పంచ్ ఇంట్లో లేక పోవడంతో వారు వెనుతిరిగారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

పామిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎద్దులపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 28వ తేదీ వరకూ పదిరోజుల పాటు ఈ క్యాంపు నిర్వహిస్తారన్నారు. ఇందులో 0 నుంచి 5 ఏళ్ల లోపు వయసున్న బాలల ఆధార్ నమోదు చేస్తారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్‌గా వినూత్న బాధ్యతలు

కూడేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ట్రైనింగ్‌లో భాగంగా ఆమె ఇక్కడ తహసీల్దార్‌గా నెల రోజుల పాటు పని చేయనున్నారు.

దళితుల భూమిని వెనక్కి ఇవ్వాలి

కూడేరు, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదరకుంట గ్రామంలో దళితుల భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. వెంటనే ఆ భూమిని వెనక్కి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధితులతో కలిసి మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో కడదరకుంటకు చెందిన దళితుల భూమిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చూపుడాయకం కింద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని భూమిని దళితులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆందోళన కారులతో చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) :మండలంలోని లచ్చానిపల్లి గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దికెర మండలం అగ్రహారానికి చెందిన హరిక్రిష్ణ బైకుపై గుత్తికి వస్తుండగా.. లచ్చానిపల్లి గ్రామశివారులో ఆ గ్రామానికి చెందిన యువకుడు ఆదర్శ మరో బైకులో ఎదురుగా వచ్చాడు. వారి రెండుబైక్‌లు ప్రమాదశాత్తూ పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలవగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హరికృష్ణను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుత్తికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

గుత్తి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): గుత్తికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని గుత్తికోట సంరక్షణ సమితి నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు ఎంపీని కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం గుత్తికోట చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమునిపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన ఇంటిలోనే ఆమె విషద్రావకం తాగి అపస్మారకస్థితిలో పడి ఉంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

యాడికి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనుప్పలపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు మధుసూదన రాజు మాట్లాడుతూ జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు వారం క్రితం కంటివైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో 11మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించామన్నారు. ఇప్పుడు వారికి ఉచితంగా వాటిని పంపిణీ చేశామని తెలిపారు. హెచ్ఎం చిన్నపెద్దన్న, సర్పంచు రామలక్షుమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) :మండలంలోని మమూడూరులో ఘర్షణ పడి ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వరలక్ష్మి, ఆమె కుమారుడు అనిల్, మరో వర్గానికి చెందిన రవి, చౌడప్ప, యల్లప్ప, పెద్దయ్య గొర్రెల జాలరీ విషయంలో గొడవపడ్డారు. మాట, మాట పెరగడంతో ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో కర్రలతో దాడి చేకున్నారు. వరలక్ష్మి, అనిల్‌కు తీవ్ర గా యాలయ్యాయి. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం మూడో రోజు న్యూకేటగిరి విభాగంలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో 11 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి ఎద్దులు 5,178 అడుగులు లాగి మొదటి బహుమతిగా రూ.50 వేలు సాధించాయి. నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తకోటకు చెందిన గురునాథరెడ్డి ఎద్దులు 4,806 అడుగులు లాగి రెండో బహుమతిగా రూ.40 వేలు సాధించాయి. అలాగే అనంతపురం జిల్లా యాడికి మండలం యంగన్నపల్లికి చెందిన రంగారెడ్డి ఎద్దులు 4,606 అడుగులు లాగి మూడో బహుమతిగా రూ.30 వేలు, నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన రోశి ఎద్దులు 4500 అడుగులు లాగి నాలుగో బహుమతిగా రూ.20 వేలు సాధించాయి. ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జంబుకేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గం, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): మాఘమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోటలో వెలసిన జంబుకేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం చేసి వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలను జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిదర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పాలనాయక మహోత్సవం

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో సోమవారం వాల్మీకి కులస్థుల ఇలవేల్పులు అయిన పాలనాయకస్వామి, చిత్రలింగేశ్వరస్వామి, ముత్త లింగేశ్వర స్వామి మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత నిర్వాహకులు స్వామివార్ల మూలవిరాట్‌లను సమీపంలోని వేదావతి హగరి నదికి తీసుకెళ్లి గంగపూజ చేశారు. తర్వాత ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు. ఈవేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

దరఖాస్తుదారులకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

పామిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో స్వయం ఉపాధి, జనరిక్ మెడికల్ షాపుల కోసం మంజూరయ్యే సబ్సిడీ రుణాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న సోమవారం ప్రకటనలో తెలిపారు. 18న పామిడి పంచాయతీ పరిధిలోని 564మంది దరఖాస్తుదారులకు, 19న మండలంలోని గ్రామీణ ప్రాంత పంచాయతీ పరిధిలోని 440మందికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో పత్రాలతో హాజరుకావాలని ఆమె సూచించారు.

యల్లనూరు: మండలంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందుటకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. తిమ్మంపల్లి బ్యాంకు పరిధిలోని వారికి ఉదయం 10గంటలకు, యల్లనూరు, వెన్నపూసపల్లి బ్యాంకుల పరిధిలోని అభ్యర్థులకు మధ్యాహ్నం 2కు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

నేడు దరఖాస్తుల పరిశీలన

పెద్దపప్పూరు: పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం బ్యాంక్ అధికారులు పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. దరఖాస్తుదారులు పాల్గొనాలని కోరారు.

యాడికిలో రేపు ..

యాడికి: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను ఈనెల 19వ తేదీ పరిశీలన చేయనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. మండలవ్యాప్తంగా 738మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని సమావేశ భవనంలో దరఖాస్తులు పరిశీలించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

శెట్టూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 11 గంటల నుంచి పలు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఎంపీడీవో రఘురామారావు ప్రకటనలో తెలిపారు. దరకాస్తుదారులు పాల్గొనాలని కోరారు.

20న హాజరుకండి

కుందుర్పి: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 20న మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఎంపీడీవో లక్ష్మీశంకర్ ప్రకటనలో సూచించారు. వచ్చేటప్పుడు దరఖాస్తు చేసుకున్న పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కుల , ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో మాఘమాసం మూడో ఆదివారం ముగిసిన సందర్భంగా అధికారులు సోమవారం హుండీ కానుకల్ని లెక్కించా రు. తాత్కాలిక హుండీ నుంచి రూ.8,24,413, శాశ్వత హుండీ నుంచి రూ.5,09,968 మొత్తం రూ.13,34,381 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. సిబ్బంది, భక్తులు పాల్గొనడం జరిగింది.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలో ఈనెల 16వ తేదీన జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారని మాస్టర్ ప్రభాకర్ సోమవారం తెలిపారు. ప్రణీత్‌కుమార్, ఆదిత్య, మనోహర్‌రెడ్డి, నిశాంత్‌కుమార్‌రెడ్డి, రిషికొరెడ్డి, గురుచరణ్ ప్రతిభ చూపి బహుమతులు, సర్టిఫికెట్‌లు సాధించారని చెప్పారు. ప్రతిభ చూపిన వారిని పలువురు అభినందించారు.

కరాటేతో ఆత్మరక్షణ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో సోమవారం బాలికల రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ అధికారిణి వెంకటేశ్వరి పాల్గొని మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదం చేస్తుందని, కనుక బాలికలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. తర్వాత బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై కళాజాతా బృందం నాటిక రూపంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం నిర్మల్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల దగ్ధం

బెళుగుప్ప, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో కాలువపల్లిలో రైతులు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవినాథ్‌రెడ్డిలకు చెందిన ఎనిమిది ఎకరాల వ్యవసాయ తోటల్లో డ్రిప్ పరికరాలు అగ్నిప్రమాదంతో దగ్ధమయ్యాయి. సోమవారం తోటలోకి వెళ్లి చూడగా డ్రిప్ పరికరాలన్నీ కాలిపోయి కనిపించాయని బాధితులు వాపోయారు. గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా నిప్పంటించడంతోనే ఇలా జరిగిందని తెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది ఎకరాలలో డ్రిప్ పరికరాలు కాలిపోవడంతో రూ. మూడు లక్షల మేర నష్టం వచ్చిందని చెప్పారు.